31న ఓపెన్ డిగ్రీ, పీజీ అడ్మిషన్ల చివరి తేదీ

సనత్‌నగర్: బేగంపేటలోని మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ, పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ఆగస్టు 31తో ముగియనున్నదని కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.రామాచారి తెలిపారు. ఓపెన్ ఇంటర్మీడియట్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా పాసైనవారు అర్హులుగా పేర్కొన్నారు. పీజీ ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ కమిషన్, సోసియాలజీ, తెలుగు లిటరేట్, ఇంగ్లిష్ లిటరేట్, హిందీ ట్రేడ్, ఉర్దూ లిటరేట్స్ వంటి కోర్సుల్లో చేరే మహిళలు ఆగస్టు 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ఆన్‌లైన్ టికెట్ విధానం ప్రారంభం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు దర్శన టికెట్లను ఆన్‌లైన్‌లో ద్వారా జారీ చేసే విధానాన్ని బుధవారం ప్రారంభించారు. ఆలయం వద్ద ఉన్న కౌంటర్లలో భక్తులకు ఆఫ్‌లైన్‌లో టికెట్లు ఇస్తూ వస్తున్నారు. ఆఫ్‌లైన్ టికెట్లు ఇచ్చే విధానంతో ఇటీవల సిబ్బంది నకిలీ టికెట్లు ముద్రించి జేబులు దండుకునట్లు గుర్తించారు. ఇందులో భాగంగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే టికెట్లు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి తమ్మినేని శేఖర్, సూపరింటెండెంట్ హైమావతి తెలిపారు.

యువకులపై దాడి

కంటోన్మెంట్: మద్యం మత్తులో రోడ్డుపై యువకులపై దాడి చేసిన ఘటన బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, రవీందర్ యాదవ్ కుమారుడు అతని సమీప బంధువులు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. స్కైలాబ్ యాదవ్ కుమారుడు యువనాథ్ యాదవ్ అతని కజిన్స్ వంశీ మనీష్లతో కలసి బుధవారం రాత్రి 8:30 సమయంలో హస్మత్పేట నుంచి సికింద్రాబాద్‌కు కారులో బయలుదేరారు. హస్మత్ పెట్ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద కొందరు యువకులు మద్యం మత్తులో రోడ్డుపైనే తమ వాహనాలు నిలిపి గొడవ పడుతున్నారు. యువనాథ్ యాదవ్ కారుకు అడ్డుగా ఉండడంతో కారులోని ముగ్గురు యువకులు కిందకు దిగి గొడవ పడుతున్న వారిని వారించారు. రోడ్డుపై గొడవ పడుతున్న యువకులు అతని కజిన్స్‌ను దాడి చేశారు. ఈ గొడవలో యువనాథ్ యాదవ్ గోల్డ్ చైన్, లాకెట్, రింగు కింద పడిపోయాయి. కొద్దిసేపటి తర్వాత రోడ్డుపై చైన్ దొరికింది. వంశీ ఫోన్ కిందపడి డ్యామేజ్ అయింది. వీరితో గొడవపడిన వ్యక్తులు ఫయాజ్, రియాజ్, బబ్లూ ఇతరులుగా గుర్తించి బోయిన్పల్లి పోలీస్ స్టేషన్‌లో యువనాథ్ యాదవ్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్ బంకులో మంటలు

తప్పిన ప్రమాదం

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని పెట్రోల్ బంకులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. పెట్రోల్ బంకు సిబ్బంది తక్షణ స్పందనతో భారీ ప్రమాదం తప్పింది. బోయిన్‌పల్లి చౌరస్తా నుంచి బాలానగర్ వెళ్లే మార్గంలోని పెట్రోల్ బంకులో బుధవారం ఉదయం లోకేశ్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోసుకునేందుకు ఆగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ బైకులో మంటలు రేగి, పక్కనే ఉన్న మరో ద్విచక్ర వాహనానికి అంటుకున్నాయి. వెంటనే అప్రమత్తమైన పెట్రోల్ బంకు సిబ్బంది మంటలను అదుపులోకి తేచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

ల్యాప్‌ట్యాప్‌లు మాయం

సనత్‌నగర్: రెండు ల్యాప్‌ట్యాప్‌లతో పాటు మొబైల్ ఫోన్, హార్డ్‌డిస్కులు కనిపించకుండా పోయిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీనగర్ అవంతినగర్ లక్ష్మి రెసిడెన్సీకి చెందిన మహేంద్ర (27)ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు.ఈ నెల 23న రాత్రి రోజూ లాగానే నిద్రకు ఉపక్రమించాడు. మరుసటి రోజు తెల్లవారుజామున 4గంటలకు నిద్ర నుంచి మేల్కొని చూడగా,ఇంట్లోని డెల్ ల్యాప్‌ట్యాప్, హెచ్ ల్యాప్‌ట్యాప్, రియల్‌మీ8 మొబైల్ ఫోన్, హార్డ్‌డిస్కులు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి వాటిని దొంగతనం చేసి ఉంటారని మహేంద్ర భావించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: రైలు పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కానిస్టేబుల్ పందరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి మల్కాజ్‌గిరి నుంచి దయానంద్ నగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాల పక్కన సుమారు 40–45 ఏళ్ల గుర్తు తెలియని నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కంకరపై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారలు లభించలేదని పోలీసులు తెలిపారు.

సిద్ధివినాయక.. హే శుభదాయక


కంటోన్మెంట్: గణేశ్ పూజల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్


అడ్డగుట్ట: నార్త్‌లాలాగూడలోని సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ త్రిముఖ


బోయిన్‌పల్లిలో చేసిన పూజల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, కమిటీ సభ్యులు


బన్సీలాల్‌పేట్: ఐడీహెచ్ కాలనీలో..

ఆయా డివిజన్లలో వాడవాడలా బొజ్జ గణపయ్య కొలువుదీరాడు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా బుధవారం ఆయా మండపాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అన్ని ఆలయాల్లో గణపతికి భక్తిశ్రద్ధలతో అర్చకులు ప్రత్యేక పూజలను చేశారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో మండపాలకు వెళ్లి గణనాథులను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సికింద్రాబాద్/కంటోన్మెంట్/సనత్‌నగర్, జోన్ బృందం


అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ పూజల్లో పాల్గొన్న సుప్రీం కోర్టు మాజీ సీజేఐ ఎన్వీ రమణ దంపతులు


లాలాపేట: తార్నాక లేబర్ అడ్డా వద్ద ఏర్పాటు చేసిన వినాయక పూజల్లో బీజేపీ జిల్లా కార్యదర్శి


రాంగోపాల్‌పేట్: స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్


మధురానగర్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో గణపతి పూజల్లో పాల్గొన్న భక్తులు


అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్‌లో పూజలు చేసిన ఏసీపీ రాఘవేంద్రరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి


గాంధీఆస్పత్రి: పూజల్లో పాల్గొన్న సూపరింటెండెంట్ రాజకుమారి, టీఎన్‌జీవో ప్రతినిధులు


లాలాపేట: తార్నాక సండే మార్కెట్‌లో..


బన్సీలాల్‌పేట్: ఐడీహెచ్ కాలనీలో..


రాంగోపాల్‌పేట్: చందన గణపతి రూపంలో స్వామివారు

దేశ క్షేమం కోసం 12 గంటల ప్రార్థనలు

రాంగోపాల్‌పేట్: భారతదేశ క్షేమాన్ని కోరుతూ అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ వైఎంసీఏలో 12 గంటల పాటు నిరవధిక ప్రార్థనలు చేశారు. అభిషేక ఆరాధన పేరుతో ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు నిర్వహించిన ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. బిషప్ డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రార్థనల్లో దేశంలో జరుగుతున్న అలజడి తగ్గి ప్రశాంత వాతావరణం ఏర్పడాలని, ఉగ్రవాద కార్యకలాపాలను దూరం చేసి దేశ ప్రజలు ప్రశాంత జీవనం సాగించేలా చూడాలని ఏసు క్రీస్తును కోరారు. దేశంలోని పాలకులు ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పాలన చేయాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ థామస్ మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో 18 వందల చర్చిల ద్వారా క్రీస్తు పరిచర్యతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. హైదరాబాద్‌లో త్వరలో ప్రతీరోజు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామని, వితంతువులకు 3 నెలల పాటు కుట్టుమిషన్‌పై శిక్షణ అందించి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో డాక్టర్ జయశీలన్, థామస్ షీబా, కృపా జయశీలన్, కన్వీనర్లు విజయ్, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న బిషప్ డాక్టర్ థామస్

ఓయూ క్యాంపస్‌లో దోమల బెడద

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో విపరీతమైన దోమలు. వర్షపు నీరు, గడ్డి, ముళ్లపొదలు, చల్లటి వాతావరణం కారణంగా ఎక్కడ చూసినా దోమలు దర్శనమిస్తున్నారు. క్యాంపస్‌లో ఒక్కనిమిషం నిలబడితే చాలు పది దోమలు కాటు వేస్తున్నాయి. దోమకాటుతో విద్యార్థులు డెంగీ, మలేరియా, ఇతర విష జర్వాల లక్షణాలు కనిపిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. రాత్రుల్లో హాస్టల్ గదుల్లో సైతం దోమలతో ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ అధికారులు వెంటనే స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

దుబాయ్‌లో బీజేపీ నేత మృతి


అశోక్‌కుమార్

సనత్‌నగర్: ఉద్యోగ రీత్యా దుబాయ్‌కు వెళ్లిన బేగంపేటకు చెందిన బీజేపీ సీనియర్ నేత పిట్ల అశోక్‌కుమార్ ముదిరాజ్ (52) గుండెపోటుతో మృతి చెందారు. దుబాయ్‌లో తాను ఉంటున్న గదిలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆయన బీజేపీ మేడ్చెల్–మల్కాజిగిరి జిల్లా లీగల్ సెల్ కో–కన్వీనర్‌గా ఉన్నారు. దుబాయ్ నుంచి ఆయన మృతదేహం శుక్రవారం ఉదయం నగరానికి చేరుకుంటుందని బీజేపీ నేతలు ఆకుల ప్రతాప్, విజయ్‌కుమార్ తెలిపారు.

చిలకగూడ మైదానంలో నిమజ్జన ఏర్పాట్లు

ప్రజలంతా వినియోగించుకోవాలని సూచన

చిలకలగూడ: చిలకలగూడ మున్సిపల్ మైదానంలో రూ.లక్షల వ్యయంతో గణనాధుడి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు తాత్కాలిక తటాకాలను ఏర్పాటు చేశామని, ప్రజలు వినియోగించుకోవాలని జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. చిలకలగూడ, వారాసిగూడ, మైలార్‌గడ్డ, పద్మారావునగర్, మెట్టుగూడ, నామాలగుండు, పార్శిగుట్ట, బౌద్ధనగర్, సీతాఫల్ మండి తదితర ప్రాంతాలతో పాటు ఇళ్లలో ప్రతిష్ఠించిన వేలాది వినాయక విగ్రహాలను చిలకలగూడ మైదానంలో నిమజ్జనం చేసేందుకు రూ.లక్షల వ్యయంతో రెండు తాత్కాలిక తటాకాలు(పాండ్స్)ను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసింది. 1 నుంచి 4 అడుగుల ఎత్తుగల విగ్రహాలను రెడీమేడ్ ప్లాస్టిక్ పాండ్, 5 నుంచి 10 అడుగుల ఎత్తుగల విగ్రహాల కోసం మరో పాండ్‌ను తవ్వి మంచినీటితో నింపారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్, నిష్ణాతులైన సిబ్బందిని నియమించారు. మట్టి, పీఓపీతో తయారు చేసిన విగ్రహాలను వేర్వేరుగా నిమజ్జనం చేస్తారు.

చిలకలగూడ ఠాణా పరిధిలో..

చిలకలగూడ ఠాణా పరిధిలో 385 వినాయక మండపాలకు అనుమతి ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు. గణపతి మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి ఆదేశాలతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 400 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామన్నారు. ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దింపామని, మండపాల వద్ద ప్రత్యేక బందోబస్తు, పలు మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కోరారు. చిలకలగూడ మైదానంలో ఏర్పాటు చేసిన నిమజ్జన తటాకాలను ప్రజలంతా వినియోగించుకోవాలని సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బౌద్ధనగర్ కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ కోరారు.


చిలకలగూడ మైదానంలో ఏర్పాటు చేసిన రెడీమేడ్ పాండ్


ప్రత్యేకంగా తవ్విన 12 అడుగుల లోతుగల చెరువు

పీఎస్‌యూ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఎస్‌యూ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: పాఠశాల స్థాయి నుంచి వర్సిటీల వరకు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ రూపొందిచిన వాల్ పోస్టర్‌ను గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులు అవుల నాగరాజు, కోట ఆనంద్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ విద్య, ఫీజుల పెంపు సవాల్‌గా మారిందన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్య సంస్థలను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. టీచింగ్ నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని అందరికీ నాణ్యమైన సమాన విద్యను అందించాలన్నారు. హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ బకాయిలను విడుదల చేయాలని వాల్‌పోస్టర్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు రాజశేఖర్, హీరేష్, శ్రీధర్‌యాదవ్, సంతోష్, విష్ణువర్ధన్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌కాలనీ పార్కులో వన మహోత్సవం


మోడల్‌కాలనీ పార్కులో మొక్కలు నాటుతున్న సిబ్బంది

సనత్‌నగర్: వన మహోత్సవంలో భాగంగా సనత్‌నగర్ మోడల్‌కాలనీ పార్కులో గురువారం మొక్కలు నాటారు. మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి హాజరై ఉద్యానవనం సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వన మహోత్సవం పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుతూ, వాటిని కాపాడుకుంటామన్నారు. ప్రాణవాయువును అందించే మొక్కలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్కు చేసిన బైక్ మాయం

సనత్‌నగర్: ఇంటి ముందు పార్కు చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీకి గురైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్–7లోని అమోఘ అపార్ట్‌మెంట్స్‌లో నివసించే సుశీల్‌కౌల్ (26) ఈ నెల 23న సాయంత్రం 6.30 గంటలకు తన రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 బైక్ (ఎంహెచ్ 05 ఈసీ 9341)ను అపార్ట్‌మెంట్ వద్ద పార్కు చేశాడు. 25న ఉదయం 9.15 గంటలకు చూడగా, పార్కు చేసిన ప్రాంతంలో బైక్ కనిపించలేదు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



లాలాపేట: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓయూ పోలీసు కానిస్టేబుళ్లు ఈ నెల 25న బ్లూ కోల్టస్ (బీసీ–3) విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఓయూ క్యాంపస్‌లోని ఏ గ్రౌండ్ సింథటిక్ రన్నింగ్ ట్రాక్ పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన దేవిదాస్ అనే వ్యక్తి 100 డయల్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 26న మృతి చెందాడు. బ్లాక్ అండ్ లైట్ బ్రౌన్ కలర్ గీతలు ఉన్న షర్టు, బ్లాక్ ప్యాంట్‌ను చనిపోయిన వ్యక్తి ధరించి ఉన్నారు. అతను దాదాపు 30 ఏళ్లు ఉంటాడని, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఓయూ ప్రొఫెసర్

ఉస్మానియా యూనివర్సిటీ: అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం లభించిన్నట్లు ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ జనటిక్స్ విభాగం అధ్యాపకురాలు ప్రొ.రోజారాణి గురువారం తెలిపారు. వచ్చే నెల 3 నుంచి 8వ తేదీ వరకు 'ద సొసైటీ ఫర్ ఉమెన్ ఇన్ సైన్స్ ఆన్ డెవలపింగ్ కంట్రీస్' ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు సస్టెయినబుల్ డెవలప్ టోల్స్ 2023–అసెస్‌మెంట్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై ఈజిప్టులో జరిగే అంతర్జాతీయ సదస్సులో 'ఇండియాస్ బయోఎకానమీ రివల్యూషన్: బయో ఈ–3 పాలసీ అండ్ ఇట్స్ జెండర్–ఇన్‌క్లూసివ్, టెక్నాలజీ–డ్రైవెన్ ఎస్‌డీజీ ఇంటిగ్రేషన్ అనే అంశంపై ప్రసంగించనున్నట్లు వివరించారు. గతంలో అమెరికాతో ఇతర దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశోధ పత్రాలను ప్రవేశపెట్టి ఉపన్యాసం ఇచ్చిన్నట్లు చెప్పారు. తొలిసారి ఈజిప్టు సదస్సుకు వెళ్తున ప్రొ.రోజారాణికి అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నేడు రాష్ట్రపతి నిలయంలో ఉచిత ప్రవేశం

బొల్లారం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం క్రీడాకారులు, క్రీడాభిమానులకు బొల్లారం రాష్ట్రపతి నిలయంలోకి ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజనిప్రియ తెలిపారు. ఈ సౌకర్యాన్ని పొందడానికి క్రీడాకారులు తమ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా సర్టిఫికెట్ లేదా ప్రభుత్వ ఐడీ కార్డు చూపించాలి. కుటుంబ సభ్యులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అదేవిధంగా, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయులు, వారి కుటుంబాలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. ఈ సౌకర్యాన్ని పొందడానికి చెల్లుబాటు అయ్యే విద్యాసంస్థలు జారీ చేసిన ఐడీ కార్డు చూపించాలి. ఈ కార్యక్రమాల ద్వారా క్రీడాకారులు, ఉపాధ్యాయులు దేశానికి అందిస్తున్న సేవలను గౌరవించడం, అలాగే ప్రజల్లో రాష్ట్రపతి నిలయం చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

నేడు బొల్లారంలో ఉచిత వైద్య శిబిరం

బొల్లారం: సదర్ బజార్‌లోని బొల్లారం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో, డాక్టర్ నాగార్జున పర్యవేక్షణలో డాక్టర్ ఏ.ప్రతాప్‌గౌడ్ క్లినిక్‌లో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు షుగర్, రక్తపోటు పరీక్షలు, క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అదేవిధంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల నివారణ, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

బన్సీలాల్‌పేట్: విద్యుత్ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ అనుబంధ విద్యుత్ సంస్థ యూనియన్ 327 నిర్మాణాత్మమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని నాయకులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ విద్యుత్ డివిజన్ 1104 యూనియన్ నుంచి పలువురు నాయకులు 327 యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గుర్రం మల్లేశం, ఉపాధ్యక్షుడు తులసీదాస్ తదితరులు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు తమ యూనియన్ అన్ని విధాలా అండగా ఉంటూ పోరాడుతుందన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు ఎక్కడ ఎలాంటి అన్యాయం జరగకుండా తమ యూనియన్ చూస్తుందన్నారు. ఉద్యోగ, కార్మికులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్‌లో చేరిన ఫోర్‌మెన్ జగదీష్, లైన్‌మెన్స్ సతీష్, గణేశ్, శ్రీహరి, ఆర్టిజెన్స్ క్రాంతి, ప్రవీణ్, కుమార్ తదితరులకు కండువాలు కప్పి 327 యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉపాధ్యక్షుడు గోవర్ధన్, అధ్యక్షుడు రామక్రిష్ణ, సెక్రెటరీ వెంకటేశ్వర్లు, కోశాధికారి సాంబశివచారి, పబ్లిసిటీ సెక్రెటరీ భాష, తదితరులు పాల్గొన్నారు.


యూనియన్‌లో చేరిన నాయకులతో 327 యూనియన్ నాయకులు